## తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, తెలుగు వికాసాభ్యుదయ ఆకాంక్షులకు
## అక్కిరాజు రమాపతి రావు విజ్ఞప్తి

తెలుగును సర్వసమగ్రంగా చైతన్య విలసితం చేయడానికి ఆంధ్రదేశంలోనూ ఖండాంతరాలలో వ్యాపించిన తెలుగు వాళ్ళూ ఎందరో కృషి చేస్తున్న కాలమిది. వీళ్ళందరి అంకితభావం అభినందనీయం. తెలుగు పరిశోధన, పరిరక్షణ, పురోభివృద్ధి, చారిత్రక వారసత్వమూ మా ఆకాంక్ష. తెలుగును సుసంపన్నమూ, ఆధునిక ప్రయోజనవంతమూ, శక్తిమంతమూ చేయటం మా లక్ష్యం. ఈ ఆశయాల సాధనకోసమే సుపథ ప్రచురణలు మొదలుపెట్టాం. ఈ ఉద్దేశ్యంతోనే ఇది వరకే పుస్తకాలు ప్రచురించాం. చెళ్ళపిళ్ళ వారి కాశీయాత్ర, భోగరాజు వారి ఆత్మకథ, పాల్కురికి సోమనాథుడి బసవపురాణం, పండితారాధ్య చరిత్ర (వచనంలో), గడియారం రామకృష్ణ శర్మ శతపత్రం (స్వీయ చరిత్ర) తిరుమల రామచంద్ర జీవితం-సాహిత్యం వంటివి. ఈ వరసలోనే మరికొన్ని ఆసక్తికరమైన కార్యక్రమాలు తలపెట్టాం. ఇది విజయవంతం కావడానికి తెలుగు వారందరి సహకారం - ముఖ్యంగా భాషా సాహిత్యాభిమానుల తోడ్పాటు - చాలా అవసరం. ఇందులో పాల్గొనదలచిన వారు, ఇంకా వివరాలు తెలుసుకోగోరిన వారు దిగువ ఇచ్చిన చిరునామాలతో (ఫోన్ లేదా ఈమెయిలు ద్వారా) సంప్రదించగలరు.

### 1. ఆధునిక తెలుగు నిఘంటువు

ఆధునిక విజ్ఞాన వాహిక కాదలచిన ఏ నాగరక భాషకయినా సంపూర్ణమైన, సమగ్రమైన, సాకల్యమైన నిఘంటువు ఎంతో అవసరం. తెలుగు భాషకు ఆధునిక నిఘంటువు లేదు. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్య ప్రాతినిధ్య నిఘంటువు ఇంతవరకు వెలువడలేదు. 19వ శతాబ్ది చివర, 20వ శతాబ్ది అంతా తెలుగు భాషాసాహిత్యాలు ఎంతో వికాసం పొందాయి. ఈ నూరు, నూట ఇరవై ఏళ్ళ కాలంలో కొత్త ప్రక్రియలు (సాహిత్య శాఖలు) సుమారు 20 దాకా మొదలై ఎన్నో రచనలు వచ్చాయి. సుమారు 100 పత్రికలు వచ్చి ఉంటాయి. వేల సంఖ్యలో కథలు, నవలలు, నాటకాలు, నాటికలు, కావ్యాలు, ఖండకావ్యాలు, విమర్శలు, సంవాదరచనలు వచ్చాయి. ఈ సర్వ రచనలలో భావాభివ్యక్తిలో ఉన్న ఎన్నో వేల పదాలు నిఘంటువులో చేరలేదు. శబ్దరత్నాకరము, బ్రౌన్ నిఘంటువు లు మనకున్నాయి. కానీ, అవి పందొమ్మిదవ శతాబ్దికి పరిమిత ప్రయత్నం. శబ్దరత్నాకర నిఘంటువు పరివర్ధితంగా ఆధునిక రూపం, సమగ్రత పొందలేదు. ఇరవయ్యవ శతాబ్ది ప్రథమ దశకాల నుంచి యాభై ఏళ్ళుగా కృషి చేసి ఎనిమిది సంపుటాలుగా వెలువరించినా కూడా సూర్యరాయాంధ్ర నిఘంటువులో వాడుక పదాలు, వ్యవహారిక శబ్దాలు ఎక్కలేదు. కొత్త పదాలు ఉదా. సంపాదకుడు, సంపాదకీయం, మాసపత్రిక, పరిస్థితి, అభిశంసన, నిరసన, నిరశన, సహకారం, అభిజ్ఞుడు, అవగాహన, అధ్యక్షత, శీతలీకరణం, గిడ్డంగి, నివేదిక, ఆదాయం, ఆకాశవాణి, దూరవాణి, దూరదర్శిని, మొదలైనవి. ఇక సామెతలు, లోకోక్తులు, పలుకుబళ్ళు, నుడికారం, జాతీయాలు ఏ నిఘంటువులోనూ చేరలేదు. ఆధునికార్థాలు, ఆధునిక భావాభివ్యక్తి

ఉన్న నిఘంటువు తెలుగులో ఒక్కటీ లేదు. ఇరవయ్యొకటవ శతాబ్ది సాహిత్య, సామాజిక నవీన వికాసానికి, ప్రయోజనానికి ప్రామాణిక, సమగ్ర నిఘంటువు ఆవశ్యకత ఎంతైనా ఉంది.

1850-2010 కాలపు తెలుగులో భావప్రకటన - వినియోగం - అభివ్యక్తిసేకరించి ఒక లక్ష పదాల విస్తృతితో ఈ నిఘంటువు రూపొందించవలసి ఉంటుంది. ఈ బృహత్ కార్యక్రమానికి, పూనికకు అకారాది పదాల కార్డులు, సహాయకులు, రాత సామాగ్రి, కార్యాలయ సరంజామా, ప్రసిద్ధ గ్రంథాలయ పర్యటన, పండిత సమావేశాలు, పురోగతి నివేదికలు, మచ్చుపుటల ప్రకటన, ఉత్తర ప్రత్యుత్తరాలు, కరపత్రాలు, వీటిని నిర్వహించే కనీస సిబ్బంది వంటి కార్యాలయ వసతులు ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది.

కాల వ్యవధి - 5 సంవత్సరాలు. అంచనా వ్యయం: 5 లక్షలు.

**2. తెలుగు కథ శత జయంతి (20వ శతాబ్ది తెలుగు కథ ప్రాతినిధ్య సంపుటి)**

20వ శతాబ్ది ప్రారంభంలో ఆధునిక ప్రక్రియ అయిన తెలుగు కథ పుట్టింది. 1900 నుంచి 2010 వరకు వచ్చిన తెలుగు కథల నుంచి ప్రసిద్ధ రచయితల కథలు నూరు లేదా నూట ఎనిమిది సంకలనం చేసి తెలుగు వారి శతాబ్ది సామాజిక వికాస పరిణామ చరిత్రను తెలిపే సాహిత్య ప్రాతినిధ్య సంపుటిగా వెలువరచనున్నాము. భండారు అచ్చమాంబ, రాయసం వేంకట శివుడు, గురజాడ అప్పారావు, వెదురుమూడి శేషగిరిరావు, కొమర్రాజు లక్ష్మణ రావు, కోటంరాజు పున్నయ్య, అక్కిరాజు ఉమాకాంతం, చింతా దీక్షితులు, నోరి నరసింహ శాస్త్రి, ముని మాణిక్యం, చలం, విశ్వనాథ, వేలూరి శివరామ శాస్త్రి, కనపర్తి వరలక్ష్మమ్మ, మల్లాది రామకృష్ణ శాస్త్రి కవికొండల వెంకటరావు, శ్రీపాద, తాత కృష్ణ మూర్తి, కొడవటిగంటి, భానుమతి, గోపీచంద్, జి.వి.కృష్ణారావు, గోరాశాస్త్రి, కాళీపట్నం, రావిశాస్త్రి, రంగనాయకమ్మ, బుర్రా సుబ్రమణ్యం, బుచ్చిబాబు, మధురాంతకం, బలివాడ కాంతారావు, పంతుల శ్రీరామ శాస్త్రి, వాకాటి, పెద్దిభొట్ల, లత, శ్రీదేవి, సులోచనారాణి - నేటి తరం ప్రసిద్ధ కథా రచయిత (త్రు) ల కథలుంటాయి. 30 కథల దాకా విపుల లో (కథల పత్రిక) ఇప్పటికే వచ్చాయి. రెండు సంపుటాలలో వస్తే బాగుంటుందని ఆలోచన.

ముద్రణ వివరాలు:

ఒక్కొక్క సంపుటి అంచనా వ్యయం: 50 వేలు,
1/8 డెమీ పరిమాణం 200 పుటలు, విపుల పీఠికా సహితం
ప్రచురణ కాల వ్యవధి: 2 సంవత్సరాలు

**3. ప్రతిభా మూర్తులు (పరివర్ధిత ద్వితీయ ముద్రణ)**

పందొమ్మిది, ఇరవై శతాబ్ది తెలుగు మహనీయుల జీవిత రేఖాచిత్రణ - సమాజం, సాహిత్యం, సంస్కృతి, లలిత కళలు, చరిత్ర పరిశోధన, నాటక రంగం, స్వాతంత్ర్యోద్యమం, సంస్థానిర్మితి, సినిమా, రంగాలకు చెందిన సుమారు 200 మంది ప్రముఖుల, ప్రతిభామూర్తుల సంగ్రహ జీవిత చిత్రణ. రెండు సంపుటాలుగా - జీవిత కాల క్రమానుసారి ప్రచురణ - మొదటి సంపుటి 100 (లేదా 104), రెండవ సంపుటి 100 (లేదా 104). ఈ సంకలనాలు ఛాయాచిత్ర సహితంగానూ, తెలుగు విజ్ఞాన సర్వస్వంలో కూడా చేరని ప్రముఖుల వివరాలతోనూ ఉంటాయి.

మొదటి సంపుటం ఇరవై సంవత్సరాల క్రితం ప్రచురితం (1990) - అందులో 130 మంది గూర్చి ఉన్నది. రెండు సంపుటాలుగా రూపొందించి త్వరలోనే తేవచ్చు. (గాజుల లక్ష్మీనరసింహులు చెట్టి, ఏనుగుల వీరాస్వామయ్య నుంచి వావిలాల గోపాలకృష్ణయ్య, మల్లాది రామకృష్ణ శాస్త్రి, మధురాంతకం రాజారాం వరకు )

ముద్రణ వివరాలు:

అంచనా వ్యయం: ఒక లక్ష రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**4. తెలుగు పత్రిక (పునఃప్రచురణ ముద్రణ)**

ఆధునిక కాలంలో తెలుగు వారి సాహిత్య సామాజిక భాషావికాసానికి గొప్ప కృషి చేసిన మూర్తిత్రయం కందుకూరి, గిడుగు, గురజాడ. తొంభై ఏళ్ళ కిందట (1919) గిడుగువారు తెలుగు పత్రికను ఏణ్ణర్ధం నడిపారు. ఆర్థిక సహాయం, ప్రోత్సాహం లేక ఆపి వేశారు. అప్పటికి భారతదేశంలోనే అటువంటి పత్రిక వెలువడలేదు. ప్రజాసామాన్యమంతా విద్యావంతులు కావాలనీ పండితభాష కాక వ్యవహారికభాష పఠన పాఠనాలలో ప్రవేశపెడితే ప్రజలంతా విద్యావంతులవుతారనీ గొప్ప ఉద్యమం గిడుగు వారు నిర్వహించారు. ఆంధ్రదేశమంతటా పర్యటించి ఇందుకు ప్రచారం చేసారు. వాద వివాదాలలో పాల్గొని తన సంకల్పం నెగ్గించుకున్నారు.

పారిస్ విశ్వవిద్యాలయంలో మహారాష్ట్ర భాష బోధించే యూల్స్ బ్లాక్, లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యుడు ఫిర్త్, నాటి భారతదేశ భాషల అధ్యయన సంగ్రాహక (Linguistic Survey of India) రచయిత గ్రియర్సన్, ఉచ్చారణ విధేయ లిపికర్త (phonetic spelling) డేనియల్ జోన్స్, గిడుగు వారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపారు. ఈ విషయాలు తెలుగు పత్రికలో కనబడతాయి.
తెలుగు పత్రిక ఒకే ఒక సంపుటి ప్రతి కాగితాలు చినిగి, ముడతలు పడి శిథిలావస్థలో తిరుపతిలో ప్రాచ్యలిఖిత పుస్తక గ్రంథాలయంలో ఉంది. ఇది కాలంలో కలిసి పోతే మరేమీ చేయలేము. తెలుగు కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుణ్ణి ముందు తరాల వారు గుర్తుంచుకోవాల్సిన బాధ్యత ఈ తెలుగు పత్రిక పునఃప్రచురణ ద్వారా నెరవేరుతుంది. DTP ప్రతి ప్రచురణకు సిద్ధంగా ఉంది.

ముద్రణ వివరాలు: 1/8 డెమీ పరిమాణం 300 పుటలు ( 18 సంచికలు)

అంచనా వ్యయం: లక్ష రూపాయలు

ప్రతుల సంఖ్య: 500 (మంచి కాగితం)

ప్రచురణ కాల వ్యవధి : 12 నెలలు

**5. ఆంధ్రి: సాహిత్య పత్రిక పునర్ముద్రణ**

1939 లో అంటే 70 సంవత్సరాల కిందట తూర్పు గోదావరి జిల్లా పల్లె పాలెం నుంచి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు తన 18 సంవత్సరాల వయస్సున ఒక సంవత్సరం నిర్వహించిన మాస పత్రిక ఆంధ్రి. ఈ సంపుటి వారి కుటుంబం ద్వారా లభిస్తుంది. మరెక్కడా దొరకదు. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి (తిరుపతి వేంకటకవులు), వేలూరి శివరామ శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, విక్రమదేవవర్మ, వేంకటరామకృష్ణ కవులు (పిఠాపురం) వంటి ప్రథితయశస్కులు ఇందులో రచనలు చేసారు. ఆంధ్రపురాణం (మహాకావ్యం); ఆంధ్ర రచయితలు (108 మంది ఆధునిక మహా రచయితలు) ద్వారా మధునాపంతుల వారు చిరస్మరణీయులు. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో హృద్య శైలీ నిర్మాత. ఆయన 'ఆంధ్ర రచయితలు' తన ఆంధ్రి పత్రికలోనే మొదటిసారి ప్రచురించారు. ఇటీవలే చనిపోయిన సత్యనారాయణశాస్త్రి గారి తమ్ముడు ఒక సంపుటి భద్రపరిచారు. దానిని సంపాదించి మళ్ళీ ప్రచురించడం తెలుగువారి కర్తవ్యం. బాధ్యత. 18 సంవత్సరాల వయసుననే గొప్ప రచయితల రచనలు తన పత్రికలో ప్రచురిస్తూ ఆ రచనలపై స్వీయ అభిప్రాయ వ్యాఖ్యలు (అసాధు ప్రయోగాలుంటే వాటిని కూడా ప్రస్తావిస్తూ) ప్రకటించేవారు. చెళ్ళపిళ్లవారు తమ కథలు-గాథలు లో ఈ విషయం ప్రసక్తం చేస్తూ విస్మయం వెలిబుచ్చారు. కళాప్రపూర్ణ విక్రమదేవవర్మగారు రాసిన ఒకే ఒక కథ (ఆధునిక దృక్పథంతో) 'ఆంధ్రి' పత్రికలో ప్రచురితమైంది. ఈ పత్రిక ద్వారా సుమారు 70 ఏళ్ళనాటి తెలుగు సాహిత్య వికాసరీతులు ఈ తరం వారికి తెలుస్తాయి.

మధునాపంతులవారి ఆంధ్రపురాణానికి విశ్వనాథ, మల్లంపల్లి, వేలూరి శివరామశాస్త్రి వంటి మాన్యులు గొప్ప పరిచయాలు రాశారు.

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం 200 పుటలు, అంచనా వ్యయం: 60 వేలు, ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**6. పరిశోధన: ద్వైమాసిక తెలుగు పత్రిక**

60 సంవత్సరాల కిందట శ్రీ తిరుమల రామచంద్ర సంపాదకత్వంలో సుమారు 2 సంవత్సరాలు వెలువడిన గొప్ప భాషా సాహిత్య పరిశోధన పత్రిక. తెలుగు వారికి స్వంత రాష్ట్రం ఏర్పడిందన్న పరమోత్సాహంతో ఎంతో ప్రామాణికమైన రచనలతో ఆయన దీనిని ప్రారంభించారు.

భాష, సాహిత్యం, సమాజం, సంస్కృతి, కళలు, పురావస్తు తత్వ విజ్ఞానం, పరిశోధనాపూర్వకంగా వెలువరించిన పత్రిక ఇది. పాల్కురికి సోమనాథుడు, గురజాడ అప్పారావు, ధర్మవరం కృష్ణమాచార్యుల ప్రత్యేక సంచికలు కూడా ఈ పత్రిక తెచ్చింది. 20వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట పరిశోధకుడు, గొప్ప పండితుడు, పురాతత్వ విజ్ఞాన కోవిదుడు, భాషావేత్త, బౌద్ధసాహిత్యవేత్త, శ్రీ తిరుమల రామచంద్ర (1913-1997). ఆయన నుడి-నానుడి, సాహితీ సుగతుని స్వగతం, మన లిపి పుట్టు పూర్వోత్తరాలు, లలిత విస్తరం (భారతీయ భాషలలో ఇంతవరకూ వెలువడని బుద్ధ భగవానుడి జీవిత చరిత్ర) కూడా ఆయనవి మళ్ళీ వెలువడవలసినవే. 2013 ఆయన శత జయంతి. అప్పటికి ఆయన రచనలన్నీ ప్రచురించగలిగితే చాలా సముచితంగా ఉంటుంది. తెలుగు భాష ఆధునిక వికాసానికి 'పరిశోధన' పత్రిక పునర్ముద్రణ ఎంతో అవసరం. నిడదవోలు, నార్ల, శ్రీశ్రీ, మల్లంపల్లి, వేటూరి వంటి మహా రచయితల రచనలు ఈ పత్రికలో ఉన్నాయి.

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం 250 పుటలు, అంచనా వ్యయం: 1 లక్ష రూపాయలు,

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**7. మను చరిత్ర - 1879 ప్రచురణ: జూలూరి అప్పయ్య పండితుడి ప్రతిపదార్థ తాత్పర్య ప్రచురణ - మను చరిత్ర అచ్చులో వచ్చిన మొదటి ముద్రణ.**

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో మనుచరిత్ర విశిష్టత అందరికీ తెలిసిందే. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ పండిత పోషక వర్గంలో జూలూరి వారు ఒకరు. బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవ జగద్విదితం. బ్రౌన్ తెలుగు తాళ పత్ర గ్రంథాలకెన్నిటికో ప్రతులు రాయించి భద్రపరిచిన గొప్ప వ్యక్తి. తెలుగు వారికి చిరస్మరణీయుడు. ఆనాడు తెలుగునాట బ్రౌన్ కు మనుచరిత్ర (తాళపత్ర) ప్రతులు ఆరు (6) మాత్రమే లభించిన వైనం ఆయన స్వీయ సాహిత్య జీవిత కథనం. మనుచరిత్ర ఆయన భద్రపరచకపోతే తెలుగు సాహిత్యం ఒక రత్న హారం పోగొట్టుకొని ఉండేది. బ్రౌన్ సేకరించిన 1870 ప్రాంతపు ఈ తొలి మను చరిత్ర ప్రచురణను పరిరక్షించుకోవాలి. నిన్నటి చరిత్ర తెలుసుకోవాలి. మనుచరిత్రకు మొదటి సారి ప్రతి పదార్థ వివరణ ఇదేననుకోవాలి.

ముద్రణ వివరాలు:

రాయల్ పరిమాణం 250 పుటలు (మంచి కాగితంపై) అంచనా వ్యయం: ఒక లక్ష రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**8. త్రిపిటక కథలు**

2500 సంవత్సరాల నాటి బౌద్ధయుగానికి చెందిన కథలు - బుద్ధ భగవానుడే చాలా కథలలో ప్రధాన పాత్ర. తెలుగులో ఇంత వరకు సమగ్రంగా ఈ కథలు వెలువడలేదు. బుద్ధ భగవానుడి నిర్యాణానంతరం ఆయన ప్రబోధాలు, ప్రసంగాలు, తత్వ చర్చలు, ఉద్బోధనలు, సూక్తాలు, సంఘ వ్యవస్థానియమ నిబంధనలు, బౌద్ధ సంఘ ఆచార్యుల, పండితుల, ప్రవర్తకుల ద్వారా సంకలనం పొందాయి. ఈ సంపుటాలనే వినయపిటకం, సుత్త పిటకం, అభిధమ్మ పిటకంగా రూపొందించారు. పాలీ భాషలో పిటకమంటే గంప అని అర్థం. బుద్ధుడి నిర్యాణానంతరం బౌద్ధ ధర్మ మహా సభలు జరిగినప్పుడు ఆయన దర్శనం గూర్చిన గోష్ఠుల, చర్చల సంకలనాలు ఇవి. క్రీ.శ.5వ శతాబ్దిలో బుద్ధఘోషుడు వీటిని పునః పరిష్కరణ సంకలనాలుగా రూపొందించాడు. ధమ్మపద గాథలు ఆయన సంపుటీకరణమే. ఈ కథలు పరంపరగా బౌద్ధ సంఘంలో నిలిచాయి. ధమ్మపదం అంటే ధర్మం గూర్చిన మాటలు అని అర్థం. ఇద్దరు ముగ్గురు రచయితలు ఇది వరలో బౌద్ధ జాతక కథలు, ధమ్మ పదం తెనిగించినా అవి సంపూర్ణంగా లేవు. కాగా, 200 కథలతో సమగ్రంగా కూర్చిన ప్రయత్నమిది.

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం సుమారు 300 పుటలు, అంచనా వ్యయం: ఒక లక్ష రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**9. సీతారామాంజనేయ సంవాదం (వచనం)**

గ్రంథకర్త శ్రీ పరశురామ పంతుల లింగ మూర్తి. ఈయన మూడు వందల ఏళ్ళ కిందటి వాడు. తెలంగాణాలో వరంగల్లు వాస్తవ్యుడు. ఈ కావ్యం తెలుగులో చాలా ప్రచారం పొందింది. యోగ వేదాంత తత్వ శాస్త్రగ్రంథం. గొప్ప కావ్యశైలిలో దీనినాయన రచించాడు. 60, 70 ఏళ్ళ కిందటి వరకు చాలా వ్యాప్తిలో ఉండేది. తారకం, సాంఖ్యం, అమనస్కం వంటి యోగసాధనలను, వేదోపనిషదప్రతిపాద్యమైన విషయాలను చెప్పినా, కావ్యశైలిలో, ప్రసన్న ధారాశైలిలో రచించినందువల్ల పోతనగారి భాగవతం, తిక్కన గారి భారతంలాగా తెలుగు వారికి ప్రీతిపాత్రమైంది.

ఇప్పుడు కావ్యాలు చదవడం సాహిత్యాభిమానులలో నైనా చాలా విరళమైపోయింది. అందువల్ల సుప్రసిద్ధ తెలుగు కావ్యాలు వచనంలో రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఉదా: ఆముక్తమాల్యద, పాండురంగమాహాత్మ్యం, నైషధం, మనుచరిత్ర, వసుచరిత్ర, పారిజాతాపహరణం వంటివి. సీతారామాంజనేయ సంవాదం మూడాశ్వాసాల కావ్యం. సీతాదేవి, శ్రీరామచంద్రుడు, ఆంజనేయస్వామికి తారక యోగం, సాంఖ్య, అమనస్క యోగాలు బోధించే ఇతివృత్తం. మూలం బ్రహ్మాండపురాణాంతర్గత శ్రీరామ హృదయం అనే ఘట్టం.

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం సుమారు 150 పుటలు, అంచనా వ్యయం: 60 వేల రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**10. ఆత్మ దర్శనులు - ఆధునిక భారత దేశపు నూరుగురు ఆధ్యాత్మిక మహా వ్యక్తుల (స్త్రీపురుషుల ) జీవిత రేఖా చిత్రణ - సంగ్రహ పరిచయ రచన**

2007-08 లలో ఈ శీర్షిక రచనలు 50 వరకు ఆంధ్ర భూమి దిన పత్రికలో ఇప్పటికే వెలువడ్డాయి. ఇంకొక 50 లేదా 58 మందిని కలిపి (108 జీవిత చరిత్రలు) అఖిల భారత పర్యాప్తంగా వెలువరిచే గ్రంథం.

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం 300 పుటలు, అంచనా వ్యయం: 60 వేల రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**11. వెయ్యిన్నూట పదహారు తెలుగు సామెతలు**

సంక్షిప్త వివరణం - విశేషాలు, తెలుగులో సామెతల సంకలనాల గూర్చిన విశేష పరిచయం .

ముద్రణ వివరాలు:

1/8 డెమీ పరిమాణం 200-250 పుటలు, అంచనా వ్యయం: 60 వేల రూపాయలు

ప్రచురణ కాల వ్యవధి: ఒక సంవత్సరం

**12. శ్రీకృష్ణ కర్ణామృతం (సరళ వచనం - ఆధునిక శైలి)**

330 శ్లోకాలతో సంస్కృత స్తుతి కావ్యాలలో శ్రీకృష్ణ కర్ణామృతానికి ఎంతో ప్రశస్తి ఉంది. శ్రీకృష్ణ కర్ణామృతం రచయిత బిల్వమంగళుడు - తెలుగు వాడనటానికి శాసనాధారాలు కూడా ఇటీవల లభించాయి. తిక్కన, ఎర్రాప్రగడల మధ్య కాలానికి సంబంధించినవాడాయన. శ్రీకృష్ణుడి వేణునాదం ఎంత మధుర మనోజ్ఞమో, బిల్వమంగళుడి స్తుతి కావ్యం కూడా అంతటి నాద సుందరంగా ఉంటుంది. ఈ తరం పాఠకులు అభిమానించే శైలిలో, మూల గ్రంథం, శ్లోకవచనీకరణం, వెలగపూడి వేంగనామాత్యుడి పద్యాలతో సహా వెలువరించాలని అభిలాష. ఇది వరలో వచ్చిన ప్రచురణలు పాత కాలపు శైలిలో ఉన్నాయి.

ముద్రణ వివరాలు:

30 చిత్ర పటాలతో అంచనా వ్యయం: 60 వేల రూపాయలు,

1/8 డెమీ పరిమాణం 250 పుటలు

ప్రచురణ కాల వ్యవధి: 6 నెలలు

వివరాలకు:
అక్కిరాజు రమాపతి రావు, 2-2-18/47 B-20 ఫ్లాట్ 104 శ్రీసాయి కృప రెసిడెన్సీ
దుర్గాబాయి దేశముఖ్ కాలనీ, హైదరాబాదు 500013
ఇంటి ఫోను +91-40-2742-3352
ramapathi.akkiraju@gmail.com (అక్కిరాజు రమాపతి రావు, హైదరాబాదు)
tadinada_sudha@yahoo.com (డా. తాడినాడ సుధ, హైదరాబాదు)
parigim@yahoo.com (పరిగి మదన్ మోహన్, అమెరికా)